❖•❖•❖ 4 ❖•❖•❖

# “మెలకువగా ఉండి ప్రార్థన చేయుడి”

*“ఆయన మరల శిష్యులయొద్దకు వచ్చి, వారు నిద్రించుట చూచి – ఒక గడియయైనను నాతోకూడా మేల్కొనియుండలేరా? మీరు శోధనలో ప్రవేశించకుండునట్లు మెలకువగా ఉండి ప్రార్థన చేయుడి; ఆత్మ సిద్ధమే గాని శరీరము బలహీనమని పేతురుతో చెప్పెను” (మత్తయి 26:40, 41).*

యేసు గెత్సేమనే తోట దగ్గరకు బహు దుఃఖముతోను బరువెక్కిన హృదయముతోను చేరుకొన్నాడు. “మరణమగునంతగా నా ప్రాణము బహు దుఃఖములో మునిగియున్నది” అని ఆయన తన ముగ్గురు శిష్యులతో చెప్పాడు (మత్తయి 26:38ఎ).

తన స్నేహితులతో కలిసియున్న సాహచర్యము ఆయన అనుభవించుచుండిన గొప్ప శ్రమల కాలములో ఆయనకు బలమును మరియు ఆదరణను చేకూర్చునని మన రక్షకుడు నమ్మాడు. కాబట్టి, ఆయన తన పదనొకొండు మంది శిష్యులను ఈ తోట లోనికి తనతో కూడ తీసుకొనివెళ్లడానికి తీర్మానించుకొన్నాడు. హిమప్రపాతము వంటి ఈ బాధను ఆయన ఒంటరిగానే భరించవలిసియున్నదని ఆయన ఎరిగియుండినప్పటికిని, వారు ఆయనకు సమీపంగా ఉండాలని ఆశించాడు. తత్ఫలితంగా, ఆయన వారిలో ఎనమందుగురిని ద్వారము దగ్గర ఉంచి, ఆయన చేయబూనిన విషయాన్ని వారితో చెప్పి, “మీరు శోధనలో

ప్రవేశించకుండునట్లు ప్రార్థనచేయుడి" అని ఆజ్ఞాపించాడు (లూకా 22:40). మిగిలిన ముగ్గురు శిష్యులను అనగా, పేతురు, యాకోబు, మరియు యోహానులను తీసుకొని, ఆయన తోటలోనికి యింకా కొంత దూరము వెళ్లాడు (మత్తయి 26:37; మార్కు 14:32, 33). చంద్రుని కాంతితో బంగారుపూత పూయబడినట్లుండిన చెట్ల ఛాయలో, "మీరు ఇక్కడ నిలిచి, నాతో కూడా మెలకువగా నుండుడి" అని ఆదేశించి, ఆయన వారిని విడిచివెళ్లాడు (మత్తయి 26:38బి).

ఏ మానవుడును ఆకళింపు చేసుకొనజాలని భారమును మోయుచు, ఆయన వారి దగ్గర నుండి యింకొంచెము దూరము వెళ్ళి, "నా తండ్రీ, సాధ్యమైతే ఈ గిన్నె నాయొద్దనుండి తొలగిపోనిమ్ము; అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్త ప్రకారమే కానిమ్ము" అని ప్రార్థించాడు (మత్తయి 26:39). పట్టువిడువని ఈ ప్రార్థనా వ్యవధి తరువాత, అనగా లోకము ఎప్పుడైనా గాని కనీవినీ ఎరిగిన దానికంటె గొప్పదియు లోతైనదియునైన విన్నపముచేయు సమయము తరువాత, ఆ ముగ్గురు శిష్యుల యొద్దకు తిరిగి వచ్చి వారు నిద్రించుట చూశాడు. ఎవరైతే ఆయనకు అత్యంత సన్నిహితముగా ఉండిరో, ఎవరినుండైతే అత్యవసరమైయుండిన ఆలంబనమును అందుకొనవలెనని ఆయన ఆశించాడో, వారే ఇప్పుడు మగతలోనికి జారిపోయారు. ఒక సున్నితమైన గద్దింపుతో, "ఒక గడియయైనను నాతో కూడా మేల్కొనియుండలేరా?" అని ఆయన మొదట పేతురును మందలించాడు. బహుశ, అటు తరువాత, మిగిలిన ఇద్దరిని చూస్తూ, "మీరు శోధనలో ప్రవేశించకుండునట్లు మెలకువగా ఉండి ప్రార్థన చేయుడి; ఆత్మ సిద్ధమే గాని శరీరము బలహీనము" అని చెప్పాడు (మత్తయి 26:40బి, 41).

ఆయన ఒంటరిగా మెలకువగా నుండి ప్రార్థన ముగించుకొని తిరిగి వచ్చిన తరువాత, ఆయనను బలపరచుటకు దేవుడు ఒక దూతను పంపాడు (లూకా 22:43). అదనముగా అందిన ఈ శక్తితో, ఆయన మరింత పట్టుదలతో ప్రార్థించాడు. ఆయన తన తండ్రి యెదుట సాగిలపడి, "నా తండ్రీ, సాధ్యమైతే ఈ గిన్నె నాయొద్దనుండి తొలగిపోనిమ్ము; అయినను నా యిష్ట ప్రకారము కాదు నీ చిత్తప్రకారమే కానిమ్ము" అని మరింత ఎక్కువ పట్టుదలతో ప్రార్థించాడు (మత్తయి 26:39, 42; హెబ్రీయులకు 5:7). కొంత సేపైన తరువాత, – అంధకార శక్తులతో జరిగిన తీవ్రమైన ఈ పోరాటములో ఆయన శక్తి వినియోగింపబడినందు వలన కారిన చెమటతో తడిసి ముద్దయైపోయి – ఆయన లేచాడు. మరొక సారి ముగ్గురు శిష్యుల యొద్దకు వచ్చిన ఆయన, వారు మరలా నిద్రించుట చూసాడు. వారు దుఃఖముచేత నిద్రించుచుండిరని లూకా వ్రాయుచున్నాడు (లూకా 22:45). ఆయన వారిని నిద్రలేపినప్పుడు, "ఆయనకేమి ఉత్తరమీయ్యవలెనో వారికి తోచలేదు" (మార్కు 14:40). మన ప్రభువు తన ప్రార్థనా స్థలానికి తిరిగి వచ్చి, "నా తండ్రీ, నేను దీనిని త్రాగితేనే గాని యిది నా యొద్దనుండి తొలగిపోవుట సాధ్యముకానియెడల, నీ చిత్తమే సిద్ధించునుగాక" అంటూ పరిశుద్ధమైన సమర్పణతో తన ప్రార్థనను కొనసాగించాడు (మత్తయి 26:42, 44).

యేసు చిత్తశుద్ధిగల మనస్సుతో తన తండ్రికి చేసిన మూడవ ప్రార్థనా వ్యవధిని ముగించుకొంటున్న సమయంలో, అల్లంత దూరాన మిణుకు మిణుకుమను మెరుపుతో వెలుగుచుండిన దీపములు కనబడుచుండినవి. కెద్రోను లోయలోనికి ఒక జనసమూహము దొమ్మిగా వచ్చుచుండినది. ఈ గుంపు, ప్రధానయాజకులు మరియు ప్రజల పెద్దలైన

పరిసయ్యులు బయలుదేరి వచ్చిన సైనికులు మరియు అధికారులను కలిగియుండి, రాత్రివేళ ఒలీవల కొండ దిగువ వైపునకు వచ్చుచుండిన వీరు దివిటీలు, కత్తులు, మరియు గుదియలు పట్టుకొని యుండిరి (మత్తయి 26:47; యోహాను 18:3). యేసు లేచి ఆయన ఏర్పరచుకొన్న ముగ్గురు శిష్యుల యొద్దకు వచ్చాడు. ఆయన, "ఇక నిద్రపోయి అలసట తీర్చుకొనుడి; ఇదిగో ఆ గడియవచ్చి యున్నది; మనుష్యకుమారుడు పాపులచేతికి అప్పగింపబడుచున్నాడు" అని వారితో చెప్పాడు (మత్తయి 26:45బి). "ఇక చాలును, గడియ వచ్చినది" అని ఆయన చెప్పినట్లు మార్కు చేర్చుచున్నాడు (మార్కు 14:41సి). ఈ మాటలనే, "మీరు యింకా నిద్రపోవుచూ అలసట తీర్చుకొనుచున్నారా?" అని NASBలో ప్రశ్నగా తెలియజెప్పుచున్నది. KJV యేసు మాటల్లో గల విధివిధాయకమైన ఈ రెండింటిని గౌరవిస్తూ, ఆయన చెప్పిన దానిని ఒక ఆజ్ఞగా అనువదించినది: "ఇక నిద్రపొండి, విశ్రాంతి తీసుకొనండి." ప్రార్థన చేయుటకు అప్పటికే ఆలస్యమైపోయిందనునది ఆయన ఆలోచనయై యుండును; ఆయన బలిగా అయ్యే గడియ సమీపించినది. "ఎంతో కాలంగా ఎదురుచూడబడుచుండిన ఈ పరిస్థితిని మనము ఉన్న పాటుననే ఎదుర్కొనవలెను. మనము ఇందు నిమిత్తము ప్రార్థనతోను విన్నపముతోను మనలను మనమే సిద్ధపర్చుకొన్నాము, లేదా విధ్వంసము చేయు ఈ సంఘర్షణలచేత మనము మ్రింగివేయబడుదుము లెండి, వెళ్లుదము" అని ఆయన చెప్పుచుండెను (మార్కు 14:42 చూడుము).

సువార్తలలో వ్రాయబడియున్న యథార్థ విషయాల కథనముల ద్వారా మనము చూచుచున్న ఈ సన్నివేశము మన రక్షకుని గూర్చి మనము మరువజాలని పటమును మనకు చూపించుట మాత్రమే గాక, ఆయన శిష్యుల యొక్క మానవ దౌర్భల్యమును తెలియజేస్తూ, వారిని లోక ప్రసిద్ధి గాంచిన వారిగా కూడా చేయుచున్నది. ఆయన దృష్టిలో ఉత్తములైనవారు. అత్యంత గొప్పగా శిక్షణ పొందిన అపొస్తలులైనవారు, అత్యంత సన్నిహితమైనవారు మరియు అత్యంత ప్రియమైన సహచరులైనవారు, చరిత్రలోని అత్యంత కీలకమైన గడియలో నిద్రించుట మనము చూచుచున్నాము. దీని నుండి మనము ఏయే (గుణ) పాఠములను నేర్చుకొనగలము?

*మనము ఒక సత్యమును గమనించకుండా ఉండజాలము: తీవ్రమైన విషమ పరిస్థితి ఎదురయ్యే సమయములలోను సందర్భములలోను – మన శారీరక స్థితితో నిమిత్తము లేకుండా* – మనకు ప్రత్యేక ప్రయాస మరియు శక్తి అవసరమై యున్నవి, ఈ సర్వోచ్ఛమైన అవసరత మనలో ఏర్పాటు నిస్సత్తువ మరియు దుఃఖమును మనము అధిగమించి ప్రార్థనలో శ్రద్ధాళువుగా ఉండుట కొరకే. మనము అలసట చెందిన మన శరీరములకు లొంగజాలము; దేవుడు మనలను శోధనలో నుండి తప్పించి యుద్ధ దినము కొరకు మనము సన్నద్ధముగా నుండునట్లు మనలను బలపరచు నిమిత్తము ఆయనను అడుగుటకు మనలో మిగిలియున్న శక్తినంతటిని మనము కూడగట్టుకొనవలసియున్నది. ఔను, బహుశ అప్పటికి మధ్యరాత్రి దాటిపోయి యుండును. అది వారి ప్రియాతి ప్రియమైన యజమాని వారిని విడిచిపెట్టి వెళ్లిపోవుట గూర్చి వారు నేర్చుకొనుచుండిన భావోద్రేకములో వారిని నీరసింపజేసిన అనుభవముతో నిండిపోయి, వారికి ఆ రోజు సుదీర్ఘమైనదై యుండును. అయినప్పటికి, సమస్తమును ఎరిగిన రక్షకుడు, వారు మెలకువగా నుండి ప్రార్థించవలెనని వారిని ప్రోత్సాహించాడు. వారి అలసట, దుఃఖము లేదా అసమగ్రతను బట్టి వారు ఈ ప్రార్థనా

సమయము నుండి క్షమింపబడ్డారని వారికి ఆయన ఎటువంటి సూచన నివ్వలేదు.

*యేసు ఆవేదనను అనుభవించుచుండినప్పటికి, ఆయన బడలిక చెందియుండిన తన శిష్యులకు తన కనికరమును మరియు గ్రహింపును కనపర్చాడు.* ఆయన వారిని గద్దించిన మాట వాస్తవమే, కానీ వారి దౌర్భల్యములను బట్టి ఆయన వారిని ధారళంగా కనికరించాడు. వారు తమ విధి నిర్వహణలో అజాగ్రత్తపరులై యుండిరి, కానీ యేసు "ఆత్మ సిద్ధమే కాని శరీరము బలహీనము" అని వారితో సున్నితముగా పలికాడు (మత్తయి 26:41; మార్కు 14:38). వారి ప్రేమ విషయములో వారు మనఃపూర్వకమైన వారై యుండిరి, కానీ వారి బడలికకు అతి సులభంగా లొంగిపోయారు. యేసు వారి వైఫల్యముల కంటే ఎక్కువగా వారి భక్తిని గుర్తించాడు, మన తండ్రి లక్షణమైయుండిన అదే కృపతో వారితో వ్యవహరించాడు. తన శిష్యులు కొంత మేరకైనా సానుభూతిని మరియు ప్రోత్సాహమును అందిస్తారని యేసు ఆశించాడు; కానీ ఆయన యెదుట నుండిన గొప్ప పరీక్ష నడుమ, ఆయన వారిని ఆదరించాడు.

*బహుశ లేఖనములలో మరెక్కడనూ వివరించబడనంత తేటగా, మనలను శోధనలో నుండి తప్పించుటకు గల ప్రార్థనా శక్తిని గూర్చిన మన ప్రభువు యొక్క అంచనాను ఈ వాక్యభాగము విడమర్చి తెలియజెప్పుచున్నది.* ఆయన తన యెదుట నుండిన పరిస్థితి యొక్క పూర్తి వివరమును బాగుగా ఎరిగియుండెను. ఆయన అపొస్తలులు నిర్బంధముల వలన కూడా కష్టాల్లో చిక్కుకుపోయిన వారౌతారు. ఆ రోజు అది వరకు ఏ రోజులేని రోజు వలె ఉండును; వారు పారిపోవుటకును, క్రీస్తును ఎరుగనని బొంకుటకును, మరియు భయము చేత క్రుంగిపోవుటకును అది అనువైన రోజై యుండును. వారు ఎదుర్కొనుచుండిన భయంకరమైన ఈ అగ్ని పరీక్ష నిమిత్తము ఏది వారిని ఉత్తమోత్తంగా సిద్ధపరచగలదు: శారీరిక విశ్రాంతినా లేక ప్రార్థించుటలో గల పట్టుదలనా? ఆయన యివ్వబోయిన జవాబు గూర్చి ఎటువంటి సందేహమైనను కలుగుటకు తావియ్యలేదు. ఐదు సార్లు, అంతర్భావమును లెక్కిస్తే అది ఆరు సార్లు కూడా అవుతుంది, వారు శోధనలో ప్రవేశించకుండునట్లు తన సహచరులు మెలకువగా నుండి ప్రార్థించవలెనని వారిని అడిగాడని మత్తయి, మార్కు, మరియు లూకా చెప్పుచున్నారు.

ఈ శిష్యులు ప్రార్థన విషయమై శ్రద్ధాళువుగలవారై యుండియున్నట్లయితే, పరిణామమేమై యుండేది? వారు యేసును విడిచిపెట్టి పారిపోయేవారేనా? ఈ అంధకార గడియను ఎదుర్కొనుచుండిన యేసుకు మనకు తెలియని ఏదో ఒక విధంగా అండదండలు అందియుండేవేనా? పరిణామములేమై యుండేవో మనము తెలిసికొనలేము, కానీ చేయవలసి యుండినదెల్లా ప్రార్థించుటయే అని యేసు నమ్మాడని మాత్రం మనకు తెలియును. యేసు ప్రార్థించినందువలన ఆయన ప్రార్థనలు ఆలకింపబడినవని హెబ్రీయులకు 5:7 చెప్పుచున్నది, గనుక దేవుని నైతిక న్యాయవర్తనమును బట్టి, శిష్యుల ప్రార్థన కూడా ఆలకింపబడియుండేదే అని మనము అనుకొనవచ్చును. వారు ప్రార్థించి యుండినట్లయితే, వారు ప్రార్థించనందువలన జరుగనిది ఏదో ఒకటి జరిగియుండేదే!

*కాబట్టి, అనుగ్రహింపబడవలెనని దేవదూతలు సహితము అపేక్షించు ఒక అవకాశమును నిర్లక్ష్యముగా వృథా చేయు విషాదాంతమును ఈ సన్నివేశము మనకు గుర్తుచేయుచున్నది.* మనము మరొకసారి ఈ సంఘటనను జ్ఞాపకము చేసుకొన్నప్పుడు, ఆ క్షణము ఎంత గణనీయమైనదో మనము గ్రహించగలము. యేసు ఒక విషమ పరీక్షను, యుగములన్నిటలోను

అత్యంత దీర్ఘకాలిక ప్రభావము కలిగియుండు సంఘటనను ఎదుర్కొనుచుండెను. రక్షకుడు లోక రక్షణార్థమైన వేదనగలవాడై యుండగా ఈ అపొస్తలులు ఆయన కొరకు ప్రార్థించుటకు వారికి ఒక అవకాశము ఇవ్వబడినది. వారు క్రీస్తుతో కూడా, సమస్త మానవుల పాప పరిహారార్థ బలిగా త్వరలోనే అర్పింపబడనై యుండినవానితో కూడా, మెలకువగా నుండుటకును, వేచియుండుటకును మరియు ప్రార్థించుటకును దేవుని కరుణ గల కటాక్షము వారిని ఈ తోట లోనికి తెచ్చినది. ఏర్పరచుకొనబడిన వారే నీరసించి నిద్రించుట, విషాదాంతములన్నిటిలో కెల్లా విచారకరమైన విషాదాంతమైయున్నది! ఆయన ఒంటరిగా శ్రమ నొందునట్లు యేసును వదలిపెట్టి వారి కొరకు వేచియుండిన శోధన వలయము లోనికి ప్రవేశించుటకు తాము సంసిద్ధులై యుండక శరీర బలహీనతకు లొంగిపోయారు. యేసు కనుబొమ్మల పైనుండిన చెమటను తుడిచివేయుటకు సిద్ధముగాను, అవసరమైన ఆశ్రయమిచ్చుటకును, ఆయనను బలపరచుటకును, ఆయనను ముట్టుటకైనను ఎవ్వరికిని సాహసము లేక దేనినైనను పుడమిపై నుండి తొలగించుటకును, దూతలు అందుబాటులోనే ఉండిరి. అపొస్తలులు మెలకువగా నుండి ఆయన కొరకును ఆయనతో కూడాను ప్రార్థించుటకు ఒక ప్రత్యేకార్హత ఇవ్వబడిరి, కానీ వారు నిద్రకులోనై అవకాశములన్నిటిలోను అత్యున్నతమైన అవకాశము గతించి పోవుటకు చోటిచ్చారు. అటుతరువాత, ఈ క్షణము ఎంతో ప్రాముఖ్యమైనదై యుండెనను అతి స్పష్టముగా నుండిన పరిజ్ఞానముతో, వారు చేసిన పొరపాటు గూర్చి ఎంతగా బాధపడియుందురో కదా!

మనము కూడా, మట్టితో చేయబడినవారమనియు మన శరీరములలో నుండి బలహీనతలకు బహు తరుచుగా లొంగిపోవుదుమనియు జ్ఞాపకముంచుకొందాము. ప్రార్థించుటకు బదులుగా, మనము కొన్నిసార్లు తమాషాగా పట్టించుకొనము; మెలకువగా నుండుటకు బదులుగా, మనము తరుచుగా నిద్రలోనికి దొర్లిపోతాము. దయ మరియు కృపగల మన ప్రభువు ఆయన పిలుపునకు అనంగీకారముగా ప్రతిస్పందించినప్పుడు సహితము ఆయన మనలో నున్న మంచినే ఎంచును. మనము శోధనలో ప్రవేశించకుండునట్లు మెలకువగా నుండుటకును ప్రార్థించుటకును మనలను మనము పునరంకితము చేసుకొందాము. వాటిలో ఏ ఒక్కటైనా భూమిని బ్రద్దలుచేయునదై మరియు ఆధ్యాత్మికముగా స్మారకమైనదై యుండగలదని మనము ఎరిగి, మనము క్రీస్తుతో కూడా గడుపగల ప్రతి నిమిషము ప్రశస్తమైనదని పరిగణించుదాము.

❖•❖•❖

*ప్రార్థించుటకు సిద్ధమై యుండు ఆత్మ మరి ఎక్కువగా సిద్ధమైనదై యుండునదిగా చేయబడును. దాని బలహీనతలతో, శరీరము మెలకువగా నుండి ప్రార్థన చేయుట ద్వారా మాత్రమే శోధనలో అడ్డుకొనబడిన దాని నుండి తప్పించబడగలదు.*